భద్రతపై అవగాహనకే విశాఖ సేఫ్టీ క్లబ్

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- క్లబ్, వెబ్‌సైట్‌ల ఆవిష్కరణ

తాటిచెట్లపాలెం: భద్రతా నియమాలు పాటించడం, ప్రమాదాల నుంచి బయటపడటం వంటి విషయాలు తెలియజేసేందుకు విశాఖ సేఫ్టీ క్లబ్ ఆవిర్భవించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. రైల్వే న్యూకాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విశాఖ సేఫ్టీ కౌన్సిల్ అనుబంధ సంస్థ విశాఖ సేఫ్టీ క్లబ్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనేక రంగాలకు చెందిన వారిని ఒక్కతాటిపైకి తీసుకొచ్చి, భద్రతపై శిక్షణ ఇచ్చి, అత్యవసర సమయాల్లో వారి సేవలను వినియోగించుకోవడం ఆనందదాయకమన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో సమయం చాలా విలువైనదని, దాన్ని వెచ్చించి ఈ క్లబ్‌లో వలంటీర్లుగా సేవలందించేందుకు ముందుకొచ్చిన వారు అభినందనీయులన్నారు. విశాఖ నగరం నేడు ఎంతో మారిందని.. ప్రజలు, పరిశ్రమల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం తరఫున ట్రాఫిక్, భద్రత, వైద్య, పోలీస్,



విశాఖ సేఫ్టీ క్లబ్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అగ్నిమాపకం వంటి విభాగాలు పనిచేస్తున్నప్పటికీ కొన్ని సార్లు సమయానికి చేరుకోలేక ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఇటువంటి క్లబ్‌ల ద్వారా వలంటీర్లు ఆయా సందర్భాల్లో సేవలందించగలరన్నారు. మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా విశాఖ సేఫ్టీ క్లబ్, వెబ్‌సైట్‌లను ప్రారంభించారు. వలంటీర్లకు అపోలో హాస్పిటల్స్ సౌజన్యంతో కిట్లు అందించి, ప్రమాదాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల పుస్తకాలను ఆవిష్కరించారు.

ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

విశాఖ సేఫ్టీ కౌన్సిల్ మేనేజింగ్ ట్రస్టీ సి.బాలసతీష్ మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణే తమ క్లబ్ ముఖ్య లక్ష్యమని తెలిపారు. పని ప్రదేశం, రోడ్లపై, ఇంటి వద్ద, నిర్మాణ, పారిశ్రామిక ప్రాంతాల్లో జరిగే ప్రమాదాలపై వలంటీర్లకు శిక్షణ, అవసరమైన కిట్లు అందజేస్తామన్నారు. దీనిలో ఎవరైనా వలంటీర్లుగా చేరవచ్చని, వారానికి కేవలం రెండు, మూడు గంటలు మాత్రం సేవలందిస్తే చాలని చెప్పారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు అపోలో హాస్పిటల్స్ ముందుకొచ్చిందని, ట్రాఫిక్, రోటరీ క్లబ్, ఆంధ్రా మెడికల్ కాలేజీల నుంచి సహాయ సహకారాలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ అత్యవసర వైద్య విభాగం వైద్యుడు డాక్టర్ బాలకృష్ణ, రోటరీ క్లబ్ విశాఖపట్నం సెంట్రల్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్, మెడికో ఉదయశ్రీ, ఏఎంసీ వైద్య విద్యార్థులు, విశాఖ సేఫ్టీ క్లబ్‌లో శిక్షణ పొందిన హెవీ వెహికల్ డ్రైవర్లు, ట్రాఫిక్, పోలీస్, రోటరీ క్లబ్‌ల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

‘స్కాడా సిస్టం’ పనితీరు భేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్

మద్దిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమివ్వనున్న జీ20 సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. విశాఖలో శనివారం పర్యటించిన ఆయన.. జీ20 సదస్సులో భాగంగా విదేశీ ప్రతినిధులు వీక్షించేందుకు వీలుగా 51వ వార్డు రవాణా శాఖ కార్యాలయ సమీప పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన 24/7 నీటి సరఫరా స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టంను పరిశీలించారు. దాని పనితీరును మంత్రికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం తాగునీటిని అందించేందుకు రూ.400 కోట్లతో స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టంను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. విశాఖకే తలమానికంగా చేపట్టిన మానవ రహిత ఎలక్ట్రానిక్ సిస్టం ద్వారా నగరంలో 3 లక్షల మందికి 60 వేల తాగునీటి కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రజలకు 24 గంటల పాటు నీటిని అందించడం



స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టం పనితీరుపై అధికారులతో మట్లాడుతున్న మంత్రి సురేష్

తోపాటు లీకేజీలను గుర్తించి తక్షణం అదుపులోకి తెచ్చేందుకు ఈ సిస్టం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఇటువంటి యంత్రాలు ఉన్నప్పటికీ స్కాడా వాటర్ మానిటరింగ్ పనితీరు మెరుగ్గా ఉన్నట్టు గుర్తించామన్నారు. మంత్రి వెంట జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, జీవీఎంసీ నీటి విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్ రవి, జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు, ఈఈ ఏడుకొండలు, ఏఈ గణేష్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిపాలెం: మహిళా, శిశు సంక్షేమ ఐసీడీఎస్ 1,2 పరిధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు అర్బన్–1 సీడీపీవో రమణకుమారి, అర్బన్–2 సీడీపీవో శ్రీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్–1కు సంబంధించి 3 ఆయా పోస్టులు, అర్బన్–2కు సంబంధించి 7 ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వెల్లడించారు. అర్హత గల అభ్యర్థులు నోటిఫికేషన్, దరఖాస్తు ఫారంను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. నివాస ధ్రువపత్రాలతో దరఖాస్తులు సంబంధిత అర్బన్ కార్యాలయాల్లో ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 3వ తేదీ లోపు సమర్పించాలని సీడీపీవోలు సూచించారు.

దొంగతనం కేసులో విచారణ

సీతమ్మధార: ఇటీవల తాటిచెట్లపాలెం సమీప కాలనీలో జరిగిన దొంగతనం కేసులో పాత నేరస్తులను ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు విచారించారు. ఎస్‌ఐ ఖగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం పోలీస్ స్టేషన్‌లో ఇంటి దొంగలు, పాత నేరస్తులను విచారించి వివరాలు, వేలిముద్రలు సేకరించారు. పలువురు యువకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

లోకోషెడ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



మృతుడు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ సమీపంలోని లోకోషెడ్ వద్ద శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి పట్టాల పక్కన మరణించాడు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు ఆదేశాలతో ఎస్‌ఐ టి.కామేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వయసు సుమారు 60–70 ఏళ్లు ఉంటుందని, ఇతని వద్ద ఏవిధమైన ఆధారాలు లేవని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు రైల్వే స్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 94934 24987 నంబర్లలో గానీ తెలియజేయాలని కోరారు.

చిన్నారి గ్రాడ్యుయేట్ల సందడి



గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు పొందిన చిన్నారులు

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్–8లోని బాలభాను విద్యాలయంలో ప్రాథమిక విభాగం విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. జగద్గురు పీఠం ప్రధాన కార్యదర్శి, బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ బి.రామకృష్ణరాజు చిన్నారులకు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పిల్లలంతా గ్రాడ్యుయేట్ల వేషధారణలో సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్వీ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ రమణరావు యూకేజీ టీచర్ జ్యోతి, ఎల్‌కేజీ టీచర్ భవాని, హేమలత, ప్రవీణ పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా గ్రీన్‌బెల్ట్



రేసపువానిపాలెం గ్రీన్‌బెల్ట్‌లో సదుపాయాలు

సీతమ్మధార: జాతీయ రహదారి వెంబడి గ్రీన్‌బెల్ట్‌లను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న జీ20 సదస్సు కోసం నగరం సుందరంగా ముస్తాబవుతోంది. ఇందులో భాగంగా 24వ వార్డు రేసపువానిపాలెం నుంచి సత్యం జంక్షన్ వరకు గల గ్రీన్‌బెల్ట్‌లో సదుపాయాలు కల్పించారు. స్థానికులు, వాకర్స్ కోసం సిమెంట్ బెంచీలు, వాకింగ్ ట్రాక్ నిర్మించారు. చెట్లకు జాతీయ జెండా రంగులు వేయడంతో గ్రీన్‌బెల్ట్ ఆకర్షణీయంగా తయారైంది. ఉదయం పూట విద్యార్థులు గ్రీన్‌బెల్ట్‌లో చదువుకుంటున్నారు. ప్రజలకు ఉపయోగకరంగా గ్రీన్‌బెల్ట్‌లను మార్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే భద్రతా దళానికి ద్విచక్ర వాహనాలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్)కు 9 ద్విచక్ర వాహనాలు చేరాయి. వీటిని శనివారం ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సీహెచ్ రఘువీర్‌తో కలిసి డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. కీలక ప్రాంతాల్లో మరింత ప్రభావవంతంగా, వేగవంతంగా ఆర్పీఎఫ్ సిబ్బంది తమ విధులు నిర్వర్తించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. డివిజన్ పరిధిలోని వివిధ యూనిట్లకు వీటిని అందజేయనున్నారు. కొత్తవలస–కిరండూల్, కోరాపుట్–రాయగడ, రాయగడ–విజయనగరం వంటి సెక్షన్లలోని కొండ ప్రాంతాలు, కీలక ప్రదేశాల్లో ఆర్పీఎఫ్ సిబ్బంది విధుల కోసం ఈ వాహనాలు వినియోగించనున్నట్లు డీఆర్‌ఎం



ద్విచక్ర వాహనాలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, ఎస్సీ రఘువీర్

చెప్పారు. ఇవి త్వరగా డివిజన్‌కు చేరడంలో కీలకపాత్రం పోషించిన ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్/ఐజీ పంకజ్ గంగ్వార్‌కు వాల్తేర్ డివిజన్ ఆర్పీఎఫ్ సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆస్కార్.. గొప్ప విజయం

ప్రముఖ సంగీత దర్శకుడు తమన్



అప్పన్న సన్నిధిలో సంగీత దర్శకుడు తమన్

సింహాచలం: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు రావడంతో తెలుగు సినిమా స్థాయి ఉన్నత శిఖరాలకు వెళ్లిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్‌ఎస్ తమన్ అన్నారు. వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా తమన్ మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో పాటకు ఆస్కార్ రావడం తెలుగు సినీ పరిశ్రమ గర్వించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం రామ్ హీరోగా.. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నట్టు చెప్పారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, సంపంగి శ్రీనివాసరావు తమన్ వెంట ఉన్నారు.

ఘనంగా ఏఎంసీ స్నాతకోత్సవం

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవం, ఎంబీబీఎస్ 96వ స్నాతకోత్సవం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగాయి. 2017 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు స్వాగతం పలికారు. రిటైర్డు డీఎంఈ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శశిప్రభ, ఏఎంసీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్ గౌరవ అతిథులుగా విచ్చేసి వైద్య వృత్తి ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 2017 ఎంబీబీఎస్ బ్యాచ్‌ను అభినందించారు. వైద్యులు మానవతా దృక్పథంతో రోగులకు సేవ చేయాలన్నారు. వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. డాక్టర్ జి. రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మిన్) కొత్తగా ఉత్తీర్ణులైన మెడికల్ గ్రాడ్యు



స్నాతకోత్సవంలో పాల్గొన్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు, డాక్టర్ బుచ్చిరాజు తదితరులు

యేట్లతో ప్రమాణం చేయించారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు ఉత్తమ విద్యార్థులు డాక్టర్ శ్యామ మదిన్య, డాక్టర్ డి.వైష్ణవి ప్రియాంక అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ 2017 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్మిస్తున్న సెంటినరీ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు.

దళిత క్రైస్తవులకు ఎంతో మేలు

సీతంపేట: దేశంలోని అన్ని రాష్ట్రాలకు స్ఫూర్తిని చ్చేలా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నం అనిర్వచనీయమైనదని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. ఈమేరకు అసెంబ్లీలో సీఎం చేసిన తీర్మానానికి ధన్యవాదాలు తెలియజేస్తూ రామాటాకీస్ వద్ద విజేత ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు షెడ్యూల్ క్యాస్ట్ హోదా కల్పిస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, ఉన్నత



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జాన్‌వెస్లీ

చదువులకు వారు పడుతున్న ఇబ్బందులు తీరిపోతాయన్నారు. సభాధ్యక్షుడు అనిల్ పాల్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులపై సీఎం వైఎస్ జగన్ చూపిస్తున్న ఆదరాభిమానాలకు దళిత క్రైస్తవులంతా రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో డేనియల్ గాబ్రియల్, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా మదర్ అండ్ చైల్డ్ కేర్‌కు సంబంధించి ప్రముఖ వైద్య నిపుణులతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిల్లల వైద్యంతోపాటు మహిళల సమస్యలు, సాధారణ వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అపోలో ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. చిన్నపిల్లలతోపాటు అన్ని వయసుల వారు పాల్గొని పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ఒక్క కార్టూన్‌తో అనేక భావాలు

అల్లిపురం: ఒక్క కార్టూన్‌తో అనేక భావాలు పలికించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. హాస్యం, వినోదం, రాజకీయం.. ఇలా ఏదైనా కార్టూన్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. మేఘాలయా హోటల్లో శనివారం జరిగిన కార్టూన్స్ వాచ్ కార్టూన్స్ ఫెస్టివల్–2023ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్టూన్ వాచ్ ఫెస్టివల్‌ను విశాఖలో నిర్వహించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్టూన్ వాచ్ కుటుంబం ఎడిటర్ త్రయంబకశర్మను గౌరవించుకోవడం ముదావహం అన్నారు. చత్తీస్‌ఘడ్ టూరిజం ఎండీ అనిల్ సాహు, డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ కార్టూన్లు ఎన్నో భావాలను తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా



కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కార్టూనిస్టులను సత్కరించారు. కార్టూనిస్టులు ఎం.శంకర్‌రావు, టి.వెంకటరావు, శ్రీహరి వెంకట రమణలకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

సీతంపేట: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అంబేడ్కర్) పనిచేస్తుందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉత్తరాంధ్ర జిల్లాల విస్తృత స్థాయి సమావేశం శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినప్పటికీ ఇంకా అసమానతలు, అణచివేతలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో దళిత, బహుజనులకు అన్యాయం జరుగుతోందని, రాజ్యాంగ లక్ష్యాలైన స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయాలకు



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్

విఘాతం కలుగుతుందని చెప్పారు. 1919లో మొదలైన అంబేడ్కర్ పోరాటం 1950 వరకు 37 ఏళ్ల పాటు కొనసాగిందని, ఆయన స్ఫూర్తితో రిపబ్లికన్ పార్టీ పనిచేస్తుందన్నారు. సమావేశంలో ప్రొఫెసర్లు పి.డి.సత్యపాల్, సి.ప్రజ్ఞ, మాటూరి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.డేవిడ్‌రాజ్, కార్యదర్శి ఇంటి గురుమూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ కొంగరాపు గణపతి, తుమ్మిడి రామ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

తగ్గిన కూరగాయల ధరలు

సీతమ్మధార: రైతుబజార్లలో పది రోజుల కిందట పెరిగిన కూరగాయల ధరలు ఈ వారం తగ్గాయి. ఈ నెల 12వ తేదీ నాటికి వంకాయలు కిలో రూ.30 ఉండగా.. శనివారానికి రూ.18, బెండకాయలు కిలో రూ.52 ఉండగా.. ప్రసుత్తం రూ.44, మునగకాయలు కిలో రూ.68 ఉండగా.. ప్రస్తుతం రూ.58, దొండకాయలు కిలో రూ.34, ప్రస్తుతం రూ.28, బరబాటి కిలో రూ.38 ఉండగా.. ప్రస్తుతం రూ.32గా ఉంది. కూరగాయల ధరలు తగ్గడంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకున్నారు. అధిక సంఖ్యలో రైతుబజార్లకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

శ్రీవాకర్స్ క్లబ్‌కు కొత్త కార్యవర్గం

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ ప్రాయోజిత వాకర్స్ క్లబ్ మలేషియాలోని శ్రీవాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నగరంలోని ఒక అపార్ట్‌మెంటులో నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులతో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువపత్రాలను అందించారు. అధ్యక్షురాలిగా భమిడిపాటి సుభద్ర శారద, కార్యదర్శిగా బి.శిరీష, కోశాధికారిగా బి.మాధురి, ఉపాధ్యక్షులుగా ఎం.దేవి రమ, ఎం.వరలక్ష్మి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఎస్.పద్మ, ఎం.పద్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్–101 ఆర్‌సీ–5 లక్ష్మీరెడ్డి, కేబినెట్ కార్యదర్శి సీహెచ్ జ్యోతి, బులిటెన్ ఎడిటర్



కార్యవర్గ సభ్యురాలికి ధ్రువపత్రం అందిస్తున్న ఉప్పలపాటి శుభ

సీహెచ్ పద్మావతి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల, వాకర్స్ ట్రస్టు బోర్డు సభ్యురాలు కె.మాధవి, సహాయ ఎడిటర్ ఆర్.స్నేహలత, త్రిస్టార్ వనితా వాకర్స్ క్లబ్ సభ్యురాలు సూర్య పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు

సీతంపేట: మల్లికా మాధుర్య స్వరాలు కల్చరల్ అసోసియేషన్ పంచమ వార్షికోత్సవాల సందర్భంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు విశేషంగా అలరించాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు నన్నపనేని మల్లికా చౌదరి సారథ్యం వహించిన సభలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న కళా సేవకులను ఘనంగా సత్కరించారు. కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, విజయ్‌నిర్మాణ్ సంస్థ అధినేత ఎస్.విజయ్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వ్యాఖ్యాత పి.రాజేంద్రప్రసాద్, సినీ నటుడు ఆర్.యాదకుమార్, చంద్రశేఖర్ పండా, కళారంగ ప్రముఖులు మహమ్మద్ ఖాన్, చెన్నా తిరుమలరావు, మస్తాన్‌రెడ్డి, సన్‌మూర్తి, జె.ఎం.ఆర్ నెహ్రూ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత



కళాకారులు అభిషేక్, జోషితలను సత్కరిస్తున్న అతిథులు

విభావరిలో గాయనీ గాయకులు కె.ఎస్.ప్రకాష్, మల్లికా పాడిన ఈ మూగ చూపేలా, రైల్వే రమణ మల్లిక పాడిన చల్లని గాలి, చంద్రశేఖర్ పాడిన రిమ్‌జిమ్ రిమ్‌జిమ్ హైదరాబాద్, బొమ్మిడి సత్యనారాయణ, శ్వేత పాడిన దంచవే మేనత్త కూతురా, సింహాచలం, మల్లిక పాడిన ఒక్కసారి చెప్పలేవా వంటి మధుర గీతాలు మంత్రముగ్ధులను చేశాయి.

శాస్త్రోక్తంగా గణపతి హోమం

సీతంపేట: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం లలితానగర్ లలితా పీఠంలో వేద పండితులు శాస్త్రోక్తంగా హరిద్ర గణపతి హోమం నిర్వహించారు. ఈ హోమం వల్ల వివాహం, ఉన్నత విద్య వంటి ప్రయోజనాలు లభిస్తాయని, ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీచక్ర నవావరణ సహిత ఆవరణ హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

వైభవుడికి ఆర్జిత సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం ఆర్జిత సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. మేళతాళాల మధ్య అర్చకులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామికి అభిషేకాల అనంతరం ఉదయం బాలభోగం, అర్చన చేశారు.రు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు.

గ్రీన్‌బెల్ట్ సందర్శన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలో హైవే పక్కన గల గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని శనివారం జీవీఎంసీ అధికారులు సందర్శించారు. దానిలో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న ఏఎస్సార్ నగర్‌వాసులతో వారు మాట్లాడారు. జీ20 సదస్సు నేపథ్యంలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రీనరీ, ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. పర్యటనలో జోన్–5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, పీడీ పాపినాయుడు, ఏపీడీ పద్మావతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఈకోర్సాతో కావలీర్స్ పోరు

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్ ఫైనల్స్‌లో ఈకోర్సా వాల్తేరుతో కావలీర్స్ సీసీ తలపడింది. శనివారం జింక్ గ్రౌండ్‌లో జరిగిన తొలి సెమీస్‌లో మోదమాంబ సీసీ తొమ్మిది వికెట్లకు 118 పరుగులు చేసింది. అకాష్‌వర్మ 38 పరుగులు చేయగా.. డేవిడ్‌రాజు నాలుగు వికెట్లు తీసి హాట్రిక్ సాధించాడు. ప్రతిగా ఈకోర్సా వాల్తేరు ఆరు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. త్రినాథ్ 28, శ్యామ్ 24పరుగులు చేశారు. కిషోర్, అప్పలరెడ్డి రెండేసి వికెట్లు తీశారు. మరో మ్యాచ్‌లో మెట్రో సీసీపై కావలీర్స్ ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. మెట్రోసీసీ తొమ్మిది వికెట్లకు 161పరుగులు చేసింది. యువన్ 73పరుగులతో రాణించాడు. ప్రతిగా కావలీర్స్‌సీసీ నాలుగు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. పాండు రంగరాజు 59 పరుగులు చేయగా అభినవ్ 37 పరుగులు చేశాడు.

2న బాడీలిఫ్టింగ్ పోటీలు

ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ పోటీలు ఏప్రిల్ 2 న జరగనుంది. 55–80 కేజీలు పైబడిన వారికి ఏడు గ్రూప్‌ల్లో పోటీలు మెన్‌కు జరగనున్నాయి. ఆంధ్రబాడీ లిఫ్టింగ్ సంఘం ఆధ్వర్యంలో మాస్టర్స్‌కు 40నుంచి 50+ వారికి మూడు గ్రూప్‌ల్లో పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ప్రవేశరుసుం చెల్లించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా మహిళాదినోత్సవం

క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు క్రీడాంశాల్లో పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉష , శోభారాణి, సెట్విస్ సీఈవో పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వీడీఎస్‌ఏ చీఫ్ కోచ్ సూర్యారావు పర్యవేక్షించారు.

బాధిత యువతి కుటుంబానికి న్యాయం చేయాలి

కంచరపాలెం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి దళిత యువతిపై లైగింక దాడికి పాల్పడి కిరాతకంగా హత మార్చిన జాఫర్ వలిని ఉరి తీయాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు డిమాండ్ చేశారు. ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు, నగర మహిళ కన్వీనర్ గొల్లమాల మీనా నేతృత్వంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం బొందలవాడకు చెందిన దళిత యువతిపై వివాహితుడైన ఆటో డ్రైవర్ జాఫర్ వలి ఈ ఘాతుకానికి పాల్పడటం దురదృష్టకరమన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి



నిరసన తెలుపుతున్న దళిత సేన నాయికులు

ఆర్థికంగా న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులతో మాట్లాడుతున్న అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు(క్లరికల్/టెక్నికల్) కె.సుధ, సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. సుమారు ఏడు లిమిటెడ్ కంపెనీల్లో 345 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్రైనీ, పెయింటర్స్, టెక్నీషియన్స్, సేల్స్, కన్సల్టెంట్స్, టెలీ కాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, డెంటర్, క్యాషియర్, ఉద్యోగాల కోసం సుమారు 348 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 98 మంది అభ్యర్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు సుబ్బిరెడ్డి తెలిపారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉపాధి అధికారి సి.ఉమాదేవి, సీహెచ్ కుమారస్వామి, ప్రతినిధులు కృష్ణచైతన్య, లత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెంలోని సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు.

కలియుగ వెంకన్నకు సుప్రభాత సేవ: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.